## స్వార్థపరుల లాభం కోసమే

# జిల్లా ఒలింపిక్ అసోసియేషన్

- రాష్ట్ర కమిటీతో సంబంధం లేకుండానే జిల్లా కమిటీ
- ఉమ్మడి 10 జిల్లాల్లోనే అధికారికంగా ఎన్నికలు
- భద్రాద్రి జిల్లాలో మాత్రం సొంతంగా కమిటీ ఏర్పాటు
- అధికారులు విచారణ చేపట్టి క్రీడారంగాన్ని కాపాడాలి
- సీనియర్ జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారుడు ఎండి బాబ్జి



కొత్తగూడెం, డిసెంబర్17(కెరటం ప్రతినిధి)

స్వార్థపరుల లాభం కోసమే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్‌ను రాష్ట్ర కమిటీతో సంబంధం లేకుండానే కొంత మంది స్వార్థ పరులు వాళ్ల స్వలాభం కోసం జిల్లా కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, ఉమ్మడి 10 జిల్లాల్లోనే అధికారికంగా ఎన్నికలు నిర్వహించారని, భద్రాద్రి జిల్లాలో మాత్రం సొంతంగా కమిటీ ఏర్పాటు చేసి క్రీడాకారుల భవిష్యత్తును భ్రష్టుపట్టిస్తున్నారని, అధికారులు విచారణ చేపట్టి క్రీడారంగాన్ని కాపాడాలని జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారుడు ఎండి బాబ్జి కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీనియర్ జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారుడు ఎండి బాబ్జి మాట్లాడుతూ.. రాష్ట్ర అసోసియేషన్‌కి అనుసంధానం లేకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ పేరుతో ఒక ఫేక్ అసోసియేషన్‌ని రిజిస్టర్ చేయించి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని జిల్లా అధికారులను, జిల్లా నాయకులకు తప్పుడు సమాచారంతో కొంతమంది సొంతంగా లబ్ది పొందేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో ఉన్న 33 జిల్లాలలో కేవలం 10 ఉమ్మడి జిల్లాలకు మాత్రమే జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఏర్పాటుకి తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మధ్యకాలంలో అన్ని జిల్లాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలను కలిపి ఉమ్మడి జిల్లాగా ఒలింపిక్ జిల్లా అసోసియేషన్‌ని ఎలక్షన్స్ ద్వారా ఎన్నుకోవడం జరిగిందని తెలియజేశారు. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం రాష్ట్ర అసోసియేషన్‌కి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తుతు మంత్రంగా ఇక్కడ కొంత మంది స్వార్థంతో సొంతంగా తప్పుడు అసోసియేషన్‌ను ఏర్పరచుకొని అందరిని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ చేశారు. క్రమశిక్షణ ఆవలంబించే ఈ క్రీడా రంగాన్ని కూడా కొంతమంది స్వార్థపరులు ఇలాంటి తప్పుడు సంఘాలు స్థాపించి భ్రష్టుపట్టిస్తున్నారని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి చాల మంది యువతీ యువకులు క్రీడలలో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, ఇలాంటి స్వార్థపరుల వల్ల క్రీడాకారులకు నష్టం వాటిల్లే ప్రమాదం లేకపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టి విషయాన్నీ ముఖ్య క్రీడా సంఘాలు అన్ని కూడా తీవ్రంగా ఖండిస్తున్నాయని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి, డిప్యూటీ యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ ఇలాంటి వారి మీద విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్య క్రీడాసంఘాలు కోరుకుంటున్నాయని సీనియర్ జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారుడు ఎండి బాబ్జి తెలిపారు.

---

## లగచర్ల బాధితులకు

# బిఆర్ఎస్ పార్టీ అండ

- రైతులకు బేడీలు.... మంత్రుల జలసాల ఇదేనా ప్రజా పాలన
- లగచర్ల రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం
- కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ ఏదో విధంగా ఇబ్బందికర పరిస్థితులు
- బిఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు
- పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి



కొత్తగూడెం, డిసెంబర్17(కెరటం ప్రతినిధి)

లగచర్ల బాధితులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, రైతులకు బేడీలు.... మంత్రుల జలసాలు ప్రస్తుతం తెలంగాణలో ఇదే ప్రజా పాలన అని, లగచర్ల రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ ఏదో విధంగా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని బిఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు వినతి పత్రం సమర్పించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, పాల్వంచ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్, మాజీ ఉర్దూగర్ కమిటీ చైర్మన్ అన్వర్ పాషా, మండల పార్టీ అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వర్లు, తులసి రెడ్డి, రాజు గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



---



## ముగిసిన బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు

కొత్తగూడెం, డిసెంబర్17(కెరటం ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ 2024 పోటీలలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఆదేశాలతో జిల్లా యువజన క్రీడల అధికారి పరదామ రెడ్డి అధ్యక్షతన సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారులు జాన్సన్ డేవిడ్(బాబు), మనీ నాయుడు ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రగతి మైదానంలో జిల్లా బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించి, సీఎం కప్ 2024 రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలో పాల్గొనే జిల్లా బాస్కెట్ బాల్ పురుషుల, స్త్రీల జట్లను ఎంపికలు చేసినట్లు తెలిపారు. ఈ పోటీలకు గాను జిల్లా నలుమూలల నుండి సుమారు 120 బాస్కెట్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో నుండి అత్యద్భుతమైన ఆటను ప్రదర్శించిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈనెల 27 నుండి 30 వరకు హైదరాబాదులో నిర్వహించు రాష్ట్రస్థాయి సీఎం కప్ 2024 పోటీలకు పంపించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి పరందామ రెడ్డి తెలిపారు. ఈ పోటీలో భాగంగా డివైఎస్ఓ ఆఫీస్ స్టాఫ్ తిరుమల రావు, లక్ష్మణ్, సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

---

## కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు

# బిఆర్ఎస్‌కు లేదు

- ఖమ్మంలో రైతులకు బేడీలు వేసింది బీఆర్ఎస్ హయాంలో కాదా..?
- లగచర్ల ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తక్షణ చర్యలు తీసుకున్నారు
- కావాలనే బిఆర్ఎస్ నాయకులు రాజకీయం చేస్తున్నారు
- కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు

కొత్తగూడెం, డిసెంబర్17(కెరటం ప్రతినిధి)



కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదని, ఖమ్మంలో రైతులకు బేడీలు వేసింది బీఆర్ఎస్ హయాంలో కాదా..? అని, లగచర్ల ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తక్షణ చర్యలు తీసుకున్నారని, కానీ కావాలనే బిఆర్ఎస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2017 ఖమ్మంలో జరిగిన నిరసనల్లో మిర్చి రైతుల చేతికి సంకెళ్లు వేసి బంధించిన ఘటనల సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖరరావు (కేసీఆర్), బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్), ఇతర బీఆర్ఎస్ నేతలు మౌనంగా ఉన్నారని, అంతేకాకుండా 2023 యాదాద్రి భువనగిరి కేసు, రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) భూసేకరణను వ్యతిరేకిస్తున్న రైతులు హ్యాండ్‌కఫ్‌లలో "పరేడ్", దళితులు, వెనుకబడిన తరగతుల సభ్యులతో సహా గ్రామస్తులను "చట్టవిరుద్ధంగా నిర్బంధించి హింసించిన" 2017 సిరిసిల్ల కేసులు మర్చిపోయి గురిగింజ సామెతలాగా బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అధికారం బీఆర్ఎస్ నాయకత్వానికి లేదని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో స్థూల మానవ హక్కుల ఉల్లంఘనల పట్ల ఉదాసీనంగా ఉన్నారు, కానీ ఇప్పుడు తక్షణ దిద్దుబాటు చర్యలు తీసుకున్న కేసును కావాలనే రాజకీయం చేస్తున్నారని, బిఆర్ఎస్ నాటకాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు అన్నారు.